సాక్షి ప్రకాశం

బుధవారం । 10 । ఏప్రిల్ । 2024



టీడీపీలో లోకల్ వార్.. నిస్తేజంలో కేడర్

నాయకత్వ లోపం తమ పార్టీ కొంప ముంచుతోందని దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకులు అంతర్మథనం చెందుతున్నారు. - 8లో..



వైభవంగా గ్రామోత్సవం

క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా మంగళవారం ప్రసిద్ధ పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వర ఆలయంలో స్వామి గ్రామోత్సవం వైభవంగా సాగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
36/28

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

బుధవారం - ఇఫ్తార్: సా॥ 6.29



పచ్చ కామెర్ల పైత్యం

పచ్చ మీడియా పైత్యం ముదిరింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక వర్గాల సమతుల్యతను పాటిస్తూ బీసీలకు పెద్ద పీట వేయడాన్ని జీర్ణించుకోలేని వారు తమ రాతలతో వికారాన్ని వండి వార్చుతోంది. టీడీపీ అధికారంలో ఉండగా జిల్లాను జలగల్లా పీల్చి పిప్పి చేసిందే ఆ పచ్చ గ్యాంగ్. సంక్షేమ పథకాలు, అభివృద్ధిలో నిష్పక్షపాతంగా వ్యవహరించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై విషం చిమ్ముతూ దిగజారుడు రోతరాతలు రాస్తోంది. నాటి పచ్చ దండు మకిలిని వైఎస్సార్‌సీపీకి పూసేందుకు పూనుకోవడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది.

- ఆ జలగలు మీ పచ్చ గ్యాంగే గురివిందా
- ఒక్కొక్కరిది ఒక్కో అరాచక చరిత్ర
- పచ్చదండు అవినీతికి అల్లాడిన జిల్లా ప్రజలు
- మరుగుదొడ్లను మింగేసిన మురికి మూకలు
- ఇసుక, నీరు చెట్టు దందాలతో రూ.కోట్లకు పడగలెత్తిన చంద్రం గ్యాంగ్



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ జిల్లా అభివృద్ధిని, ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసింది. ఆ పార్టీ ప్రజాప్రతినిధులు అభివృద్ధి పేరుతో జిల్లాను పీల్చిపిప్పి చేశారు. సహజ వనరులపై రాక్షసుల్లా పడి అడ్డంగా దోచుకున్నారు. సంక్షేమ పథకాలను రాబందుల్లా తన్నుకుపోయారు. ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లాలో పచ్చ గ్యాంగ్ ఒకొక్కరిది.. ఒక్కొక్క అరాచక చరిత్ర. మురుగు కాల్వలను, మరుగు దొడ్లను కూడా వదిలి పెట్టకుండా విచ్చలవిడిగా ప్రభుత్వ నిధులను మింగేశారు. నీరు–చెట్టు పేరుతో చేసిన దోపిడీకి లెక్కే లేదు. ఆ పార్టీ ప్రజాప్రతినిధుల దగ్గర నుంచి చోటా నేతల వరకూ పాల్పడిన అవినీతి, అక్రమాలు నేటికీ జిల్లా వాసులు మర్చిపోలేదు. జన్మభూమి కమిటీల పేరుతో చేసిన ఆగడాలు ఇప్పటికీ జిల్లా ప్రజల ముందు కదలాడుతూనే ఉంటుంది. ఇవన్నీ రాజగురివింద మర్చిపోయినట్టున్నారు. మేమంతా సిద్ధం సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను పరిచయం చేశారో లేదో మరుసటి రోజు పచ్చ పత్రికలు ఇష్టారాజ్యంగా కథనాలు వండి వార్చి అక్కసును వెళ్లగక్కాయి. 2014 నుంచి 2019 నడుమ పచ్చదండు అరాచకాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

అప్పుడు, ఇప్పుడూ.. కనిపించలేదా గురవిందా?

టీడీపీ పాలనలో ప్రజాప్రతినిధులు ప్రజాసమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్నికల సమయంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు జిల్లాకు వచ్చి అలవికాని హామీ ఇచ్చి వెళ్లిపోతుండేవారు. అవి ఒక్కటీ కూడా అమలు కాలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తూనే గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేపట్టింది. నాడు–నేడు పేరుతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేసింది. పలు ప్రభుత్వాస్పత్రులను అభివృద్ధి చేసింది. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుచేసి రైతుల ముంగిటకే అన్నీ తీసుకువచ్చింది. గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రభుత్వ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చింది. జిల్లా వాసుల దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసింది. పశ్చిమాన కృష్ణమ్మ పరుగులు తీసేలా పలు మంచి నీటి పథకాలకు శ్రీకారం చుట్టింది. ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో జిల్లావాసులు వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఓటమి భయంతో ఉన్న తెలుగుదేశం పార్టీని భుజానెత్తుకుని మోస్తున్న పచ్చ మీడియా ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోజుకో కథనాన్ని వండివారుస్తోంది.

అభ్యర్థులపై అక్కసు

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై అక్కసు వెళ్లగక్కుతూ 'జనం మీద వదిలిన జలగలు' అనే కథనాలను ప్రచురించింది. వాస్తవానికి అధికార పార్టీ జిల్లాలో అన్నీ వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ అభ్యర్థులను ఎంపిక చేసింది. కనిగిరి నుంచి యాదవ సామాజిక వర్గానికి చెందిన దద్దాల నారాయణ యాదవ్ అనే ఒక సామాన్యుడికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీటు ఇచ్చి పోటీకి అవకాశం కల్పించారు. ఒక సామాన్యుడికి సీటు ఇవ్వడం సహించలేని ఎల్లో మీడియా ఆయన మీద తప్పుడు ప్రచారానికి పూనుకుందని జిల్లాలోని యాదవ సంఘాల నాయకులు మండి పడుతున్నారు. ఒక పక్క టీడీపీలో జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న నూకసాని బాలాజీ యాదవ్‌ను అడుగడుగునా అవమానాలకు గురి చేయడమే కాకుండా ఆయనకు సీటు ఇవ్వకుండా ద్రోహం చేసిన టీడీపీ నాయకులు కనిగిరిలో పోటీ చేస్తున్న నారాయణ యాదవ్‌పై లేనిపోని ఆరోపణలు చేయడమేంటని బీసీ సంఘాలు మండి పడుతున్నాయి. అయినా 2014 నుంచి 2019 వరకు జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులు చేసిన అవినీతి , అరాచకాలు పచ్చమందకు కనిపించక పోవడంలో విడ్డూరమేమి నని, నాటి అరాచకాలను జిల్లావాసులు ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటున్నారు.

అవినీతికి చిరునామా ధనార్జన్ :

ఒంగోలు నుంచి పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను ఇక్కడి ప్రజలు ముద్దుగా ద్రామచర్ల ధనార్జన్ అని పిలుచుకుంటారు.

స్వామి ...మరుగుదొడ్డి నిధులు మింగేశాడు..

ఆయన పేరుకు మాత్రమే ఎమ్మెల్యే . పెత్తనం అంతా దామచర్ల సత్యదే. దామచర్ల కుటుంబ ప్రయోజనాల కోసం నియోజకవర్గ ప్రజలను ద్రోహం చేసిన ఆయన కొండపిలో ఇసుక స్వామిగా పేరొందాడు. 2014, 2019లో రెండు సార్లు గెలిచిన డోలా బాలాంజనేయ స్వామి నియోజక వర్గం కోసం చేసిందేమీ లేదని ప్రజలు మండిపడుతున్నారు. నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసి దామచర్ల సత్యకు నమ్మిన బంటుగా పనిచేస్తున్నాడని విమర్శలు ఉన్నాయి. కొండపి నియోజకవర్గంలోని సింగరాయకొండ మండలం పాకల వద్ద పాత పాలేరుపై చెక్‌డ్యాం నిర్మాణాన్ని అడ్డుకున్న చరిత్ర స్వామిది. ఈ చెక్‌డ్యాం నిర్మాణం జరిగితే 500 ఎకరాల ఆయకట్టుకు ప్రయోజం చేకూరుతుంది. భూగర్భ జలాలు పెరిగి నియోజకవర్గంలో మంచినీటి సమస్య పరిష్కారం అవుతుంది. కానీ ఈ ప్రాంతంలో దామచర్ల పూర్ణచంద్రరావుతో పాటుగా దామచర్ల బంధువులకు రొయ్యల చెరువులు ఉన్నాయి. చెక్‌డ్యాం నిర్మిస్తే ఈ రొయ్యల చెరువులకు దెబ్బ పడుతుంది. అయితేనేం ప్రజల ప్రయోజనాల కంటే దామచర్ల ప్రయోజనాలే స్వామికి ముఖ్యం కనుక ఈ డ్యాంను అడ్డుకున్నాడని రైతులు మండిపడుతున్నారు. ఇక చంద్రబాబు పాలనలో స్వామి ఎగబడి అవినీతికి పాల్పడినట్లు విమర్శలు వెత్తాయి. మరుగుదొడ్ల నిర్మాణాల నుంచి మొదలుకొని మురుగు కాలువల వరకు దేనిని వదిలిపెట్టకుండా అవినీతికి పాల్పడ్డారు. ఇసుక దందాలో జిల్లాలోనే పేరొందాడు.



2014 ఎన్నికల్లో గెలిచిన ఆయన ఎమ్మెల్యేగా వెలగబెట్టిన ఐదేళ్లు ప్రజలకు నరకం చూపించారు. ఆయన హయాంలో సొంత సామాజిక వర్గం తప్ప మిగిలిన సామాజిక వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్నారు. ఇక అవినీతిలో దామచర్ల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. కొత్తపట్నం, ఈతముక్కల రోడ్డు నిర్మాణం విషయంలో పర్సంటేజీలు తీసుకొని తన అనుయాయులకు కట్టబెట్టేందుకు చేసిన ప్రయత్నాలు జిల్లా ప్రజలందరికీ తెలుసు. అప్పుడు తనకు వ్యతిరేకంగా టెండరు వేసిన చీమకుర్తికి చెందిన ఒక మాజీ మండలాధ్యక్షుడి ఇంటిని పగులగొట్టించేందుకు ప్రయత్నించడం సంచలం సృష్టించింది. నగరంలోని పాత చేపల మార్కెట్ వద్ద నుంచి మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం వరకు నిర్మించిన మురుగు కాలువ ప్రారంభించకుండానే కూలిపోయింది. కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు పాసైపోయాయి. పింఛన్ ఇవ్వాలన్నా, పక్కా గృహాలు మంజూరు చేయాలన్నా పైసలు ఇవ్వందే పనులు చేసేవారు కాదన్నది ప్రతి ఒక్కరికి తెలిసిందే. చివరికి పసుపు కుంకుమ పథకానికి కూడా జన్మభూమి కమిటీలు డబ్బులు వసూలు చేయడం విమర్శల పాలైంది. ఇక ఆర్యవైశ్య సోదరులు వ్యాపారాలు చేసుకోకుండా అధికారుల ద్వారా దాడులు చేయించి వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. కర్నూలు రోడ్డులో ఒక వ్యాపారి వద్ద రూ.40 లక్షలు అప్పు తీసుకొని తిరిగి ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. తనకు రావాల్సిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగి అడిగి అలసిపోయిన ఆయన అదే బాధతో మరణించాడని చెబుతారు. ఇలాంటి అప్పు కథలు చాలా ఉన్నాయని తెలిసింది. అద్దంకి బస్టాండ్ సెంటర్లో ముస్లింలకు చెందిన దుకాణాలను పడగొట్టించడంతో పాటుగా ఆ సామాజిక వర్గానికి వ్యతిరేకంగా అనేక సార్లు నేరుగా విమర్శలు చేయడం గురించి ముస్లిం సోదరులు ఇప్పటికీ చెప్పుకుంటున్నారు.

ఒకటే పని..రెండు బిల్లులు.. ఇది గూడూరి ప్రత్యేకత...

కనిగిరి నియోజకవర్గం నుంచి దిగుబడైన గూడూరి ఎరిక్షన్ బాబు స్టయిలే వేరు. ఆయన వెలిగండ్ల జెడ్పీటీసీగా పనిచేశాడు. తెలుగుదేశం హయాంలో జన్మభూమి కమిటీలను అడ్డం పెట్టుకొని పెద్ద మొత్తంలో నిధులను స్వాహ చేసినట్లు ఆరోపణలున్నాయి. వెలిగండ్లలో మట్టిరోడ్లు వేయకుండానే వేసినట్లు భారీగా నిధులను గోల్‌మాల్ చేసినట్లు సమాచారం. కనిగిరి నుంచి వెలిగండ్లకు, వెలిగండ్ల నుంచి కనిగిరికి రోడ్డు వేసినట్లు ఒకే పనికి రెండు బిల్లులు చేసిన ఘనాపాటి గూడూరి. ఇక రియల్ ఎస్టేట్ పేరుతో అనేక మంది నెత్తిన శఠగోపం పెట్టినట్లు ఇక్కడి ప్రజలు చెప్పుకుంటున్నారు.

హిమ్‌బాబా... ఆత్మహత్య రాగం

నాకు ఇవే చివరి ఎన్నికలు..ఈ సారి నన్ను గెలిపించకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటున్నాడు మార్కాపురం తెలుగుదేశం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి. మార్కాపురం ప్రజలు 2009లో ఒకసారి ఓట్లేసి గెలిపించారు. నిజంగానే ప్రజా సేవ చేస్తాడేమో అనుకున్నారు. అయితే నారాయణరెడ్డి గెలిచిన తరువాత తన అసలు రూపం చూపించాడు. విపరీతంగా అవినీతికి పాల్పడ్డారు. నీరు చెట్టు పనులు చేయకుండానే కోట్లాది రుపాయలు బిల్లులు పాస్ చేసుకున్నాడు. నియోజకవర్గంలో ఒక్క ఇంకుడు గుంత తీయకుండానే కోట్లు డబ్బులు జేబులో వేసుకున్నాడు. ఇక హిమ్ సంస్థ అక్రమాలతో నారాయణరెడ్డి పేరు రాష్ట్రం అంతటా పాకింది. నిరుపేద ప్రజలు, దళితులు, బీసీల నుంచి హిమ్ అనే సంస్థ డబ్బులు వసూలు చేసి ఒట్టి చేతులు చూపింది. మోసపోయిన ప్రజలు పోలీసుస్టేషన్‌లో కేసులు కూడా పెట్టారు. ఈ కేసు విచారణలో నారాయణరెడ్డి కీలకమైన వ్యక్తిగా బయటపడింది. దాంతో ఆయన మీద కూడా కేసు నమోదైంది. అప్పట్లో తెలుగుదేశం పార్టీ మద్దతులో పరిపాలన చేసిన కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో కేసును కొట్టివేయించుకున్నట్లు తెలుస్తుంది. ఆ తరువాత ఇక్కడి ప్రజలు ఆయనను ఓడించి ఇంటికి పరిమితం చేశారు. ఇప్పుడు మళ్లీ ఆయన సేవ చేసే అవకాశం ఇవ్వమని అడుగుతుంటే మార్కాపురం ప్రజలు భయపడిపోతున్నారు.

బావ కళ్లలో ఆనందం కోసం...

బావ కళ్లల్లో ఆనందం కోసం బావమర్ది డబ్బులు వసూళ్లకు పాల్పడడం గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. 2014లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలిచిన ముత్తముల అశోక్‌రెడ్డి ఆ తరువాత నాడు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి అమ్ముడు పోయారు. ఎప్పుడైతే భుజాన పచ్చ కండువా వేసుకున్నాడో అతడిలో అవినీతి పరుడు బయటపడ్డాడు. అతడు ఎమ్మెల్యేగా బడా కాంట్రాక్టు పని పడుతుంటే ఆయన బావమర్ది ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థల చుట్టూ తిరుగుతూ బావ కళ్లలో ఆనందం కోసం వసూళ్లకు పాల్పడేవాడు. నీరు చెట్టులో చెక్ డ్యాంలు, కుంటలంటూ భారీగా బిల్లులు చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. సీసీ రోడ్లు వేసి కమీషన్లు దండుకున్నట్లు విమర్శలున్నాయి.

అరాచకాలకు కేరాఫ్ ఉగ్ర...

కనిగిరి నియోజకవర్గం నుంచి 2009లో విజయం సాధించిన ఉగ్ర నరసింహారెడ్డి పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులకు గురైనట్లు ప్రచారం జరుగుతోంది. ఉగ్ర ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో అతడి అనుచరులు చేసిన అరచకాలు అన్నీ ఇన్నీ కావు. సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు దినదిన గండంగా రోజులు గడిపారని చెప్పుకుంటారు. ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ పేరుతో పేదలకు ఇవ్వాల్సిన భూములను తన అనుచరులకు కట్టబెట్టినట్లు నియోజకవర్గ ప్రజలు ఇప్పటికీ చెప్పుకుంటున్నారు. ఇక విలువైన ప్రభుత్వ, ప్రైవేటు భూములను కాజేసినట్లు ఆరోపణలున్నాయి. ఎక్కడా ఖాళీ భూమి కనిపిస్తే అక్కడ ఉగ్ర గ్యాంగ్ ప్రత్యక్షమయ్యేవాళ్లు. ఇక ఉద్యోగులు, వ్యాపారులను పీల్చి పిప్పి చేసినట్లు విమర్శలున్నాయి. ఎవరైనా ఇదేంటని ప్రశ్నిస్తే వారి మీద దాడులకు పాల్పడేవారు. ఉగ్ర హయాంను కనిగిరి ప్రజలు చీకటి రోజులుగా చెప్పుకుంటారు. తాజాగా అవ్వాతాత పింఛన్ల పంపిణీపై అవహేళనగా, అహంకారిక పూరితంగా చేసిన వాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. రూ. 3 వేల పింఛన్ లేక పోతే చచ్చిపోతారా అంటూ చేసిన వాఖ్యలపై వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు మండిపడుతున్నారు.

న్యూస్‌రీల్

మంత్రి సురేష్ కాన్వాయ్ తనిఖీ



మంత్రి సురేష్ కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

సింగరాయకొండ: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ కొండపి అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కాన్వాయ్‌ను పోలీసులు మంగళవారం తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం, మూలగుంటపాడు పంచాయతీ వెంకటేశ్వర కాలనీ వద్ద ఎస్సై టి. శ్రీరాం ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో మంత్రి కాన్వాయ్ అటుగా రావడంతో పోలీసులు వాహనాన్ని తనిఖీ చేసి పంపించారు.

వైభవంగా జాళ్లపాలెం తిరునాళ్ల



ఆలయం వద్ద భక్తుల సందోహం

కొండపి(మర్రిపూడి): ఉగాది పర్వదినాన మండలంలోని జాళ్లపాలెంలో కొత్తపల్లి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల వైభవంగా జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ ఈఓ, పోలీస్ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, మంచినీరు అందజేశారు.

నాటుసారా బట్టీలు ధ్వంసం

- ఇద్దరు అరెస్టు

సీఎస్‌పురం(పామూరు): నాటుసారాను తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై బి.ప్రేమ్ కుమార్ తెలిపారు. మండలంలోని మైలుచర్ల అటవీప్రాంతంలో సీఐ ఎం రామానాయక్, కనిగిరి సెబ్ సీఐ లీనా ఆధ్వర్యంలో దాడుల నిర్వహించి నాటుసారా తరలిస్తున్న మండలంలోని మైలుచర్ల గ్రామానికి చెందిన దొర తిరుపతయ్య, కొమరోలు మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన కానుగారి శ్రీకాంత్‌నాయుడులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా, 30 కేజీల బెల్లంను స్వాధీనం చేసుకొని బట్టీలను ధ్వంసం చేశారు.

రాష్ట్రంలో జనరంజక పాలన



13వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సిటీ: కుల, మత, వర్గ విభేదాలు లేకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. నగరంలోని 13వ డివిజన్ పరిధిలోని కబాడీపాలెంలో మంగళవారం మన ఒంగోలు–మన వాసన్న ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ నాయకులు, కార్యకర్తలు బాలినేనికి ఘన స్వాగతం పలికారు. అనంతరం బాలినేని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో జనరంజక పాలన అందించారని కొనియాడారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. దేశంలో ఎన్నో రాష్ట్రాలు మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిందని పేర్కొన్నారు. ఒంగోలు నగరాన్ని ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, టీడీపీ నేతలు ఎన్ని కుట్రలు పన్నినా నగరంలో 25 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని తెలిపారు. 2024 ఎన్నికల్లో గెలిచిన తరువాత ఇళ్ల పట్టాలు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ఇళ్లు కట్టించి ఇస్తామని భరోసా ఇచ్చారు. అయితే పేదల సంక్షేమాన్ని టీడీపీ జీర్ణించుకోలేకపోతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి టీడీపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు ఆ పార్టీని నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 13 వ డివిజన్ కార్పొరేటర్ కొప్పర్ల కమల, డివిజన్ అధ్యక్షుడు మానసపల్లి రాజేష్, నగర మేయర్ గంగాడ సుజాత, వుడా చైర్మన్ సింగరాజు మీనా వెంకటరావు, మాజీ ఎమ్మెల్యే కె. ఆదెన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలకు దన్నుగా నిలిచింది జగనన్నే

- మంత్రి మేరుగ నాగార్జున

మద్దిపాడు: బీసీలకు వెన్నుదన్నుగా నిలిచింది ముఖ్యమంత్రి జగనన్నేనని మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు అభ్యర్థి మేరుగ నాగార్జున అన్నారు. వెల్లంపల్లి ఆవాస్ హోటల్‌లో మంగళవారం జరిగిన బీసీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి పలు పథకాలు అమలుచేశారన్నారు. చంద్రబాబునాయుడు కేవలం బీసీలను ఓట్లగా వాడుకొని వెన్నుపోటు పొడిచాడని ధ్వజమెత్తారు. బీసీలకు అన్ని విధాలా వెన్నుదన్నుగా నిలిచింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. చట్ట సభల్లో బీసీలకు ప్రథమ ప్రాధాన్యత కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ ఒక్కరేనని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో బీసీలంతా ఐక్యంగా జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేసే సమయంలో ఎవరు తమకు మంచి చేశారో గుర్తు పెట్టుకుని మరీ ఓటు వేయాలన్నారు. పేదల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, పార్టీ ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి, కార్యదర్శి మోరబోయిన సంజీవరావు, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, సీనియర్ నాయకులు పిట్టల ఆంజనేయులు, గుద్దపాతల రవి, తేళ్లపుల్లారావు, నన్నెబోయిన వెంకటాద్రి, మద్దా లక్ష్మీనారాయణ, మజీద్ మాస్టర్, బొమ్మల దేవదాసు, లక్ష్మీనారాయణ, రాచవారిపాలెం సర్పంచ్ నాగమల్లేశ్వరి పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు. తొలుత బీసీ సంఘ నాయకులు మంత్రిని ఘనంగా సన్మానించారు.



మంత్రి మేరుగ నాగార్జునను సన్మానిస్తున్న బీసీ నాయకులు



పూజలు చేస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఉగాది సరికొత్త ఉషస్సులు నింపాలి

- ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి
- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: శ్రీక్రోధి నామ సంవత్సరంలో వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ ఆకాంక్షించారు. ఈ ఉగాది ప్రజలందరి జీవితాల్లో సరికొత్త ఉషస్సులు నింపాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో స్పందన భవనంలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన, పూజలతో జాయింట్ కలెక్టర్ వేడుకలు ప్రారంభించారు. తొలుత వేద పండితులు మఠంపల్లి దక్షిణామూర్తి పంచాంగ పఠనం చేశారు. జేసీ మాట్లాడుతూ తెలుగు ప్రజల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక ఉగాది పండుగ అన్నారు. తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా తాళ్లూరు మండలం లక్కవరం ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయ అర్చకులు నడింపల్లి సాంబసదా ప్రసాదరావు, టంగుటూరు మండలం కాకుటూరివారిపాలెంలోని కోదండ రామ స్వామి దేవస్థానం అర్చకులు పరాంకుశం సత్య నారాయణాచార్యులు, ఒంగోలు కేశవస్వామి పేటలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ అర్చకులు పిన్నులి చంద్రశేఖరశర్మను సత్కరించి రూ.10,116, నూతన వస్త్రాలు ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనం ఆహుతులను ఆకట్టుకుంది. పంచాంగ శ్రవణం చేసిన దక్షిణామూర్తిని అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ విద్యాధికారి సామా సుబ్బారావు, దేవాదాయ అధికారి కోవూరి జనార్దన్‌రెడ్డి, ఒంగోలు ఆర్‌డీఓ బీవీ సుబ్బారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పంచాంగ శ్రవణం చేస్తున్న మఠంపల్లి దక్షిణామూర్తి, పక్కన జేసీ గోపాలకృష్ణ

క్లుప్తంగా

స్కూటీ అదుపుతప్పి చిన్నారి మృతి


ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి

కొండపి(మర్రిపూడి): స్కూటీ అదుపు తప్పడంతో కన్న తల్లి ముందే కుమార్తె కానరాని లోకాలకు వెళ్లింది. ఈ విషాద ఘటన కొండపి మండలంలోని వెన్నూరు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గోగినేనివారిపాలేనికి చెందిన గోగినేని శాంతి తన ఇద్దరు పిల్లలతో కలిసి కందుకూరు మండలం కొండముడుసుపాలెం నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో వెన్నూరు సమీపంలో స్కూటీ అదుపు తప్పడంతో యశ్వత్ లక్ష్మి(9) రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందింది. అప్పటి వరకు చలాకీగా మాట్లాడుతూ ఉన్న కుమార్తె కళ్ల ముందే కానరాని విగతజీవిగా మారడంతో తల్లి శాంతి కన్నీటి పర్యంతమైంది. చిన్నారి మృతితో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుమారుడు దేవాన్ష్‌కు స్వల్ప గాయాలు కావడంతో 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ బాజిబాబు తెలిపారు.

నాయకత్వ లోపం తమ పార్టీ కొంప ముంచుతోందని దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకులు అంతర్మథనం చెందుతున్నారు. అభ్యర్థి ఎంపికలో గందరగోళం, గ్రూపు రాజకీయాలు నేటికీ సమసిపోకపోవడంతో టీడీపీ కేడర్‌లో నిస్తేజం నెలకొంది.

- దర్శిలో టీడీపీకి ఘోర పరాభవం తప్పదంటున్న సొంత పార్టీ శ్రేణులు
- నియోజకవర్గంలో అడుగుపెడుతూనే పక్కా లోకల్ అని చెప్పిన గొట్టిపాటి లక్ష్మి
- టీడీపీ శ్రేణులతోపాటు ప్రజల్లోనూ విస్తృత చర్చకు దారితీసిన లక్ష్మి వ్యాఖ్యలు
- మీ పార్టీకో దండమంటూ రోజుకో గ్రూపు వైఎస్సార్ సీపీలో చేరిక
- మరోవైపు ప్రచారంలో దూసుకెళ్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



టీడీపీలో లోకల్ వార్.. నిస్తేజంలో కేడర్

దర్శి:

దర్శి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిగా టీడీపీ తరఫున గొట్టిపాటి లక్ష్మిని ఖరారు చేసి బరిలోకి దించిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 4వ తేదీన ఆమె దర్శిలో తొలిసారి ఎన్నికల ప్రచారం నిర్వహించగా ప్రజల నుంచి స్పందన కరువైంది. కేడర్‌లో పట్టుమని పది మంది కూడా ఆమె వెంట ప్రచారానికి రాకపోవడం గమనార్హం. దర్శిలో ఆమె అడుగుపెట్టినప్పటి నుంచి ముస్లిం మైనారిటీలు, బీసీ సామాజికవర్గానికి చెందిన 500 మందికి పైగా టీడీపీ సానుభూతిపరులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. దీనికితోడు గొట్టిపాటి లక్ష్మి ప్రచారంలో పైసా ఖర్చు చేయడం లేదని కార్యకర్తలు అసంతృప్తితో రగిలిపోతున్నారు.

టీడీపీ శ్రేణుల నుంచే వ్యతిరేకత

2009 సార్వత్రిక ఎన్నికల్లో దర్శి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మన్నం వెంకటరమణతో చంద్రబాబు పోటీ చేయించారు. ఆయనతో టీడీపీ అధిష్టానం భారీగా డబ్బు ఖర్చు చేయించగా.. సొంత సామాజిక వర్గం వారే నాన్ లోకల్ అంటూ ఓడించారు. రాబోయే ఎన్నికల్లో దర్శి నుంచి పోటీ చేసేందుకు ఒంగోలు చెందిన గోరంట్ల రవికుమార్ ఉవిళ్లూరగా స్థానికుడే కావాలని ప్రధాన నాయకులు పట్టుబట్టడంతో చంద్రబాబు వెనక్కి తగ్గారు. దర్శిలో బూచేపల్లిని ఎదుర్కొనే సత్తా ఉన్న నేతలెవరూ లేకపోవడంతో మల్లగుల్లాలు పడిన టీడీపీ అధిష్టానం చివరికి గొట్టిపాటి లక్ష్మిని బరిలోకి దించింది. చంద్రబాబు ఏకపక్ష నిర్ణయాన్ని స్థానిక టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. స్థానికేతరురాలైన వ్యక్తికి సపోర్ట్ చేసే ప్రసక్తే లేదని అంతర్గత సమావేశాల్లో టీడీపీ నేతలు తెగేసి చెబుతున్నారు. నియోజకవర్గంలో సొంత పార్టీ శ్రేణుల నుంచి వ్యతిరేకత ఎదురవుతుండటం, గెలుపు అవకాశాలు అంతంతమాత్రమేనని గ్రహించిన గొట్టిపాటి లక్ష్మి కాస్తో కూస్తో కూడా డబ్బు ఖర్చు చేయడానికి వెనుకాడుతున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.

దర్శిలో అడుగుపెట్టిన తొలిరోజే 'నేను పక్కా లోకల్' అని గొట్టిపాటి లక్ష్మి చేసిన వ్యాఖ్యలపై టీడీపీ శ్రేణులతోపాటు ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. 'నరసరావుపేట నుంచి దర్శికి వచ్చిన ఆమె ఎలా లోకల్ అవుతుంది.. వచ్చిన తొలిరోజే ఇలా అబద్ధాలు మాట్లాడమేంటి' అని టీడీపీ నేతలే ప్రశ్నిస్తున్నారు. లక్ష్మి వ్యాఖ్యలపై నెటిజన్లు సైతం విరుచుకుపడ్డారు. 'దర్శిలో ఇల్లూవాకిలి లేదు.. నీ పూర్వీకులు, కుటుంబీకులు కూడా ఎప్పుడూ ఇక్కడ నివాసం ఉండలేదు. అలాంటపుడు ఎలా లోకల్ అవుతావ్' అని సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు నిలదీస్తున్నారు.

బూచేపల్లిని ఢీకొట్టలేం!

వైఎస్సార్ సీపీ దర్శి అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో స్పీడ్ పెంచారు. ఆయన తల్లి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సతీమణి నందిని సైతం గడప గడపకూ వెళ్లి ప్రజలతో మమేకం అవుతున్నారు. బూచేపల్లి ఇప్పటికే దర్శి నియోజకవర్గంలో 80 శాతం ప్రచారం పూర్తి చేయడం విశేషం. గత 20 ఏళ్లుగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి స్థానికంగా నివాసం ఉంటూ నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తున్నారు. గత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నప్పటికీ ప్రజాభిమానం ఏమాత్రం తగ్గని బూచేపల్లిని రాజకీయంగా ఢీకొట్టడం కష్టమని దర్శికి చెందిన టీడీపీ నేత ఒకరు పేర్కొన్నారు.

పొదిలమ్మ గుడిలో చెవిరెడ్డి ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

పొదిలి: ఉగాది పర్వదినం సందర్భంగా స్థానిక పొదిలమ్మ గుడిలో వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, పాడి పంటలు, అష్టైశ్వర్యాలతో తులతూగాలని, శాంతియుతమైన జీవితం గడపాలని అమ్మవారికి పూజలు చేసినట్లు పేర్కొన్నారు. చెవిరెడ్డికి ఆలయ పూజారి వెంకటస్వామి ఆశీర్వచనం అందించారు. ఆయన వెంట ఆనికాళ్ల రాజారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ఇంగ్లిష్ స్పీకింగ్‌లో ఉచిత శిక్షణ

- 'మేధా ఇన్‌స్టిట్యూట్' ఫౌండర్ చిరంజీవి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ప్రాథమిక విద్య నుంచీ ఇంగ్లీషు మీడియాన్ని అందుబాటులోకి తేవటం ప్రశంసనీయమని 'మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్' వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎ.చిరంజీవి అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా ఏ రంగంలోనైనా ఇంగ్లిష్‌పై పట్టున్న వారికే అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయని చెబుతూ.... ఆసక్తి ఉన్నవారి కోసం తమ సంస్థ ఉచితంగా ఇంగ్లీషు స్పీకింగ్ కోర్సును అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. ''మా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈజీ ఇంగ్లీష్ కార్యక్రమాన్ని తలపెట్టాం. ఆన్‌లైన్లో ఉచితంగా అందజేస్తాం'' అని చెప్పారాయన. ఈజీ ఇంగ్లీష్ ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్ మాత్రమే కాకుండా దాదాపు 9 రకాల అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు. ఈ నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. ''ఈ కోర్సుకు ఆసక్తి ఉన్న ఎవరైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం దిగువ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుంటే చాలు. వారి మొబైల్‌కు రిజిస్ట్రేషన్ లింకు వస్తుంది. లేనిపక్షంలో 9866006662 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపినా వారి మొబైల్ ఫోన్‌కు లింకును పంపిస్తాం'' అని వివరించారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుందని, ఆ తర్వాత తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


మృతి చెందిన పాపయ్య

కురిచేడు: మండలంలోని పడమర నాయుడు పాలెం గ్రామంలో విద్యుత్‌షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లె పాపయ్య(49) మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్ తిరగకపోవటంతో మరమ్మతులు చేసేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఎన్నికల్లో అఖండ విజయం మీదే..


వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి సురేష్


పంచాంగ శ్రవణంలో మంత్రి సురేష్

- పంచాంగ శ్రవణంలో మంత్రి సురేష్‌తో పురోహితుడు
- జాళ్లపాలెం తిరునాళ్లకు హాజరైన మంత్రి

కొండపి(మర్రిపూడి)/జరుగుమల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధిస్తారని, క్రోధి నామ సంవత్సరంలో వృషభరాశి వారికి గౌరవం అధికంగా ఉందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌తో ప్రముఖ పురోహితుడు నవీన్ కుమార్ శర్మ పేర్కొన్నారు. జరుగుమల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పంచాంగ శ్రవణంలో మంత్రి పాల్గొన్నారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పిన్నిక శ్రీనివాసరావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు కొమ్మాలపాటి మధు, జరుగుమల్లి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బత్తిన మనోహర్, మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ రామచంద్రరావు, నాగినేని భాస్కర్ చౌదరి, దగ్గుమాటి శంకరరెడ్డి, వైస్ ఎంపీపీ పులి భిక్షాలు, చాగంటి కొండయ్య, జరుగుమల్లి సర్పంచ్ కసుకుర్తి పున్నారావు, కొండూరి ప్రశాంతరెడ్డి, దగ్గుమాటి జయరామిరెడ్డి, చుండూరి సురేష్, చుండి శ్రీనివాసులు చెన్నారెడ్డి రామ్మూర్తి తదితరులు ఉన్నారు.

వీరబ్రహేంద్ర స్వామి ఆలయంలో మంత్రి సురేష్ పూజలు

ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం కొండపి మండలం జాళ్లపాలెంలోని పోతులూరి వీరబ్రహేంద్ర స్వామిని మంత్రి ఆదిమూలపు సురేష్ దర్శించుకుని పూజలు చేశారు. మంత్రికి పెద్దకళ్లగుంట సర్పంచ్ భువనగిరి సత్యన్నారాయణ, మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ. క్రోధి నామ సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

అనంతరం భక్తులకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి డాకా పిచ్చిరెడ్డి ఏర్పాటు చేసిన అన్న సంతర్పణలో పాల్గొన్నారు. మంత్రి వెంట కొండపి మండల కన్వీనర్ ఆరికట్ల కోటిలింగయ్య, జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మరళి, టంగుటూరు మండల కన్వీనర్ మల్లవరపు రాఘవరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.


గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- నెలనెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం
- తగ్గుతున్న రక్తహీనత సమస్య
- 16,570 మంది గర్భిణుల్లో ఇద్దరికి మాత్రమే హెచ్‌బీ 7 శాతం కన్నా తక్కువ

బేస్తవారిపేట: గర్భిణుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. నెలనెలా ఉచితంగా వైద్య పరీక్షలు చేయిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సరఫరా చేస్తోంది. ఆరోగ్య సమస్యలున్నవారికి ఉచితంగా మందులు అందజేస్తోంది. సుఖప్రసవాలను ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో గర్భిణుల్లో అనారోగ్య సమస్యలు తగ్గుతున్నాయి. రక్తహీనత సమస్య నుంచి బయటపడుతున్నారు.

ఇదీ లెక్క...

ఆస్పత్రి రికార్డుల ప్రకారం జిల్లాలో 17,550 గర్భిణులు నమోదయ్యారు. పీహెచ్‌సీల్లో 16,570 మంది గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. హెచ్‌బీ 11 శాతం 12,610, 10 శాతం 3271, 9 శాతం 687, 7 శాతం కన్నా తక్కువ ఇద్దరు గర్భిణులు ఫిబ్రవరి 2024 నాటికి నమోదయ్యారు.

హిమోగ్లోబిన్ పెరిగేలా..

గర్భం దాల్చిన వెంటనే గర్భిణుల వివరాలను ఏఎన్‌ఎంలు ఆరోగ్య యాప్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారు. ఆ తర్వాత హెచ్‌బీ, బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి, హెచ్‌బీ తక్కువగా ఉన్నట్లు నిర్ధారణ అయితే చికిత్స అందిస్తారు. హెచ్‌బీ 6, 7 పాయింట్లు ఉన్నవారికి రక్తం ఎక్కిస్తారు. హెచ్‌బీ 8 గ్రాములు ఉన్నట్లయితే వారికి సుక్రోజ్ వ్యాక్సిన్లు పీహెచ్‌సీలో ఇస్తున్నారు. హెచ్‌బీ 9 గ్రాములు ఉన్నవారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందిస్తున్నారు. ప్రసవ సమయానికి గర్భిణి ఇబ్బంది పడకుండా అవసరమైన రక్తం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

నెలనెలా పౌష్టికాహారం పంపిణీ..

గర్భిణులకు రక్తం పెరిగేలా ప్రభుత్వం ప్రతినెల అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సరఫరా చేస్తుంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద రాగి పిండి, అటుకులు, బెల్లం, వేరుశనగ చిక్కీలు, ఎండు ఖర్జూరం, పాలు, గుడ్లు, ఆయిల్‌తో కూడిన కిట్టును అందిస్తోంది. ప్రభుత్వం గర్భిణుల ఆరోగ్యానికి ప్రత్యేక కృషిచేస్తోంది.

ప్రతి నెలా ఉచిత పరీక్షలు



గర్భిణులకు ప్రతి నెలా 9, 10వ తేదీల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. హెచ్‌బీ శాతం పెరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. అందులో భాగంగా మంచి పౌష్టికాహారం అందిస్తోంది.

– పి.పృథ్వీరాజ్, పీహెచ్‌సీ వైద్యాధికారి, బేస్తవారిపేట

చంద్రబాబు మోసపు హామీలు నమ్మొద్దు

- తాటిపర్తి చంద్రశేఖర్


రెంటపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న తాటిపర్తి

పుల్లలచెరువు: చంద్రబాబు ఇచ్చే మోసపూరిత హామీలను నమ్మి మోసపోవద్దని వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని రెంటపల్లి, సిద్ధనపాలెం గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. గ్రామాల్లో ప్రజలు నీరాజనం పట్టారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ పేదల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాన్ని ప్రవేశపెట్టి సుమారు రూ.3 లక్షల కోట్ల నగదును అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమచేశారని గుర్తు చేశారు. చంద్రబాబు కోసం రాష్ట్రంలో పచ్చ మీడియా చేసే ప్రచారాలను నమ్మే పరిస్థితి లేదన్నారు. టీడీపీ పాలనకు, ప్రస్తుత పాలనకు మధ్య తేడా ప్రజలు గమనించాలన్నారు. సంక్షేమాన్ని ఇంటి వద్దకు తెచ్చారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలా చేయలేదన్నారు. త్వరలోనే జగనన్న మేనిఫెస్టోను విడుదల చేస్తారని, 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేనాలు కలిసి 600కు పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశాయని గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో కూడా ఆ పార్టీలు జతకట్టాయని చెప్పారు. ఈసారి జరిగే ఎన్నికలు పెత్తందార్లు, పేదల మధ్య జరుగుతున్న యుద్ధమని అభివర్ణించారు. అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనకు, ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఎంపీపీ వెంకటయ్య, జెడ్పీటీసీ వాగ్యానాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి, ఎంపీటీసీ రాములు, మండల సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్ గాలిరెడ్డి, మల్లెల వెంకటేశ్వరెడ్డి, దినేష్, మాజీ యూత్ అధ్యక్షుడ గడ్డం సుబ్బయ్య, రోశిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, కొల్లయ్య పాల్గొన్నారు.

వైభవంగా త్రిపురాంతకేశ్వరుని గ్రామోత్సవం


త్రిపురాంతకంలో శ్రీత్రిపురాంతకేశ్వరస్వామి గ్రామోత్సవం


భైరవకోనలో త్రిముఖ దుర్గాదేవి ఆలయంవద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు

త్రిపురాంతకం/సీఎస్‌పురం(పామూరు): క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా మంగళవారం ప్రసిద్ధ పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వర ఆలయంలో స్వామివారి గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఏటా ఉగాది సందర్భంగా ఉత్సవమూర్తులను భక్తులతో ఊరేగించే ఆనవాయితీ ఈ ఏడాదీ కొనసాగించారు. అనంతరం ఆలయ వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో వసంత నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి పల్లకీ సేవలో భక్తులు పాల్గొన్నారు. ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఇమ్మడిశెట్టి సుబ్బారావు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

భైరవకోనకు పోటెత్తిన భక్తులు

ప్రముఖ పర్యాటక పుణ్యక్షేత్రం భైరవకోనకు ఉగాది సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. త్రిముఖదుర్గాదేవి, నగరేశ్వర, భర్గులేశ్వర, కాలభైరవ ఆలయాల్లో విశిష్ట పూజలు నిర్వహించారు. సీఎస్‌పురంలోని రాచూరి పెద్దమ్మ ఆలయంలో అమ్మవారు వెండిచీర అలంకరణలో కొలువుదీరారు. భైరవకోన ఆలయ చైర్మన్ సిద్దు రమణారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


సీఎస్‌పురంలో వెండిచీర అలంకరణలో రాచూరి పెద్దమ్మ మూలవిరాట్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

దర్శి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముసలారెడ్డి అనే యువకునికి తీవ్రగాయాలైన సంఘటన పొదిలి రోడ్డులోని హెచ్‌పీ పెట్రోలు బంకు సమీపంలో మంగళవారం జరిగింది. తీవ్ర రక్త స్రావంతో ఉన్న ముసలారెడ్డిని స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పైలట్ నగేష్, ఈఎంటీ గౌస్ బాషా ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రికి చేర్చారు.